సాక్షి
నల్లగొండ
బుధవారం । 2 । అక్టోబర్ । 2024



వేధింపులు తాళలేకనే హత్య

రెండో పెళ్లి చేసుకుని వేధిస్తున్న భర్తను మొదటి భార్య తరఫు బంధువులు దారుణంగా హత్య చేశారు.

- 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	588.80 అడుగులు
ఇన్‌ఫ్లో	50.557 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	50.557 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	29.435 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	10.120 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	8.022 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	2.400
వరద కాల్వకు	600

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	643.80 అడుగులు
ఇన్‌ఫ్లో	1,665.01 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	1,665.01 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	314.73 క్యూసెక్కులు
కుడికాల్వకు	314.73 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

పాఠశాలలకు నేటి నుంచి దసరా సెలవులు

నల్లగొండ: పాఠశాలలకు బుధవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిందని డీఈఓ భిక్షపతి మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. తిరిగి 15వ తేదీ పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు.

రేపటి నుంచి ఎంజీయూకు..

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీకి ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారు. ఈ నెల 14న యూనివర్సిటీలో తరగతులు పునఃప్రారంభం అవుతాయని రిజిస్ట్రార్ ఎ.రవి తెలిపారు.

3న వర్క్‌షాప్

ఈ నెల 3న ఎంజీయూలో విద్య, పరిశోధనల ప్రమాణాలు పెంపొందించేందుకు సెంటర్ ఫర్ రివర్స్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఎ.రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యాపకులు, యూనివర్సిటీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్ విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా అనితారామచంద్రన్



నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి 10 జిల్లాలకు ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు ప్రత్యేక అధికారిగా పంచాయతీ రాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె ప్రభుత్వం నిర్వహించే వివిధ కార్యక్రమాలకు ప్రత్యేక అధికారిగా వ్యవహరించనున్నారు.

నాగిరెడ్డికి ఉత్తమ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ అవార్డు



నాగిరెడ్డిని సన్మానిస్తున్న మంత్రి సీతక్క

నల్లగొండ: కలెక్టరేట్‌లోని మహిళా, వయోవృద్ధుల సంక్షేమ శాఖలో పనిచేస్తున్న మునగాల నాగిరెడ్డికి ఉత్తమ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ అవార్డు దక్కింది. ఎంతో మంది వృద్ధులకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నందుకు ఈ అవార్డు లభించింది. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.సీతక్క చేతుల మీదుగా నాగిరెడ్డికి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ వృద్ధులకు అందించిన సేవలను ప్రభుత్వం గుర్తించి ఈ అవార్డు అదజేయడం ఆనందంగా ఉందన్నారు.

‘ఓపెన్’ అడ్మిషన్ల గడువు పొడిగింపు

రామగిరి(నల్లగొండ): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ యూజీ, పీజీ, డిప్లొమా సర్టిఫికెట్ కోర్సుల అడ్మిషన్ల గడువును ఈనెల 15 వరకు పొడిగిస్తూ యూనివర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల పొందాలనుకునే వారు టీఎస్. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్‌ఏఓయూ.ఇన్ వెబ్‌సైట్ల నందు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఇంప్లాంట్స్ టెండర్లలో గోల్‌మాల్!

నల్లగొండ టౌన్: ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్సల్లో వినియోగించే ఇంప్లాంట్స్ సరఫరా కోసం వేసిన టెండర్లలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో ఇంప్లాంట్స్ కొనుగోలు కోసం అర్హత కలిగిన సరఫరా సంస్థల నుంచి సంబంధిత అధికారులు గత నెల 9న టెండర్ నోటిఫికేషన్ వెలువరించారు. 17న టెండర్ దాఖలుకు చివరి గడువు విధించారు. టెండర్లు వేసిన మూడు సంస్థల్లో రెండు జిల్లా కేంద్రానికి చెందినవి కాగా.. ఒక సంస్థ హైదరాబాద్‌కు చెందినదిగా సమాచారం. టెండర్ నిబంధనల ప్రకారం జీజీహెచ్‌కు 15 కిలోమీటర్ల లోపు సంస్థ కార్యాలయం ఉండాలి. కానీ, జీజీహెచ్‌లోని కొందరు ఆర్థోపెడిక్ వైద్యులు, అధికారులు కలిసి.. ఓ సంస్థ కార్యాలయం జిల్లా కేంద్రంలో ఉన్నట్లు అప్పటికప్పుడు ఏర్పాటు చేసి ఆ సంస్థకు అన్ని నిబంధనల ఉన్నట్లు పత్రాలను సృష్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనల ప్రకారమే ఎంపిక

దీనిపై జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి స్పందిస్తూ.. అన్ని నిబంధనల ప్రకారమే జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ ఎంపిక చేసిందని చెప్పారు. ఎక్కడ కూడా అక్రమాలు జరగలేదని తెలిపారు.

● బడిలో బతుకమ్మ



నల్లగొండ పట్టణం యాట కన్నారెడ్డి కాలనీలోని న్యూస్ స్కూల్‌లో మంగళవారం ముందస్తుగా నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు, టీచర్లు

● ‘ఎంగిలిపువ్వు’కు సిద్ధం





బతుకమ్మ పండుగలో భాగంగా బుధవారం మొదటి రోజు నిర్వహించే ఎంగిలిపువ్వు వేడుకల సందర్భంగా నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు, అమ్మకానికి సిద్ధంగా ఉంచిన టేకు పూలు

కొత్త టీచర్లు వస్తున్నారు..

దసరా తర్వాత విధుల్లోకి..

- త్వరలో భర్తీకానున్న ఉపాధ్యాయ ఖాళీలు
- 2024 డీఎస్సీ ద్వారా 605 మందికి ఉద్యోగాలు
- కాంట్రాక్టు పద్ధతిన మరికొందరు..
- కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన



నల్లగొండ: విద్యా శాఖలో టీచర్ కొలువుల కోలాహలం నెలకొంది. ప్రభుత్వం జూలై, ఆగస్టు మాసాల్లో నిర్వహించిన డీఎస్సీ–2024 ఫలితాలను సోమవారం విడుదల చేసి 1:3 పద్ధతిన అభ్యర్థులను సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచింది. ఇదిలా ఉంటే 2008లో జరిగిన డీఎస్సీలో 30 శాతం కోటా అర్హత కలిగిన బీఈడీ అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిన విధుల్లోకి తీసుకునేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ రెండు డీఎస్సీలకు సంబంధించి ప్రస్తుతం సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయితే జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లోకి కొత్త టీచర్లు రానున్నారు.

కొత్తగా 605 మందికి పోస్టింగ్

2024 డీఎస్సీ నోటీఫికేషన్ ప్రకారం జిల్లాలో మొత్తం 605 టీచర్ పోస్టులు ఉన్నాయి. ఇందులో 430 ఎస్‌జీటీలు, 175 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. వీటిని నింపేందుకు 1:3 నిష్పత్తి ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. అయితే మంగళవారం నుంచి నల్లగొండలోని డైట్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయితే జిల్లాలో ఈ డీఎస్సీ ద్వారా 605 మంది కొత్తగా ఉపాధ్యాయ విధుల్లో చేరనున్నారు. అలాగే 2008లో జరిగిన డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిన విధుల్లోకి తీసుకునేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 391 మంది అభ్యర్థులు ఉండగా నలగొండ జిల్లాకు 150మంది పైచిలుకు ఉన్నారు. ఇప్పటికే వీరిని దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం కోరింది. ఇప్పటి వరకు 150 మంది పైచిలుకే దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే కాంట్రాక్టు పద్ధతిన మరికొందరు ఉపాధ్యాయులు రానున్నారు.

తీరనున్న ఉపాధ్యాయుల కొరత

ఏటా పదవీ విరమణలే తప్ప పెద్దగా ఉపాధ్యాయ నియామకాలు లేనందున ఖాళీల సంఖ్య భారీగానే ఉంది. దీంతో సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో మొన్నటికి మొన్న 2008 డీఎస్సీ అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిన నియమించుకోవడం, తాజాగా 2024 డీఎస్సీ ఫలితాలు విడుదల చేసి మరికొందరికి పోస్టింగ్‌లు ఇవ్వనుండడంతో జిల్లాలో ఉపాధ్యాయుల కొరత తీరనుందని విద్యా శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

9న నియామక పత్రాలు

పాఠశాలలకు ఈనెల 2 నుంచి విద్యా శాఖ దసరా సెలవులు ప్రకటించింది. తిరిగి 15వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. అయితే డీఎస్సీ 2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 5 వరకు పూర్తవుతుంది. ఆ తర్వాత అభ్యర్థులను ఎంపిక చేసి దసరా కానుకగా 9న నియామక పత్రాలు ఇస్తామని సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. నియామక పత్రాలు తీసుకున్న వారంతా దసరా సెలవుల తర్వాత విధుల్లో చేరనున్నారు.

జిల్లా వ్యాప్తంగా భర్తీ అయ్యే పోస్టులు ఇవీ..

కేటగిరీ	పోస్టులు				
ఎల్‌పీ–హిందీ(జి)	02	ఎస్‌ఏ–ఇంగ్లిష్(ఎల్‌బీ)	18	ఎస్‌ఏ–తెలుగు (జీ)	02
ఎల్‌పీ–హిందీ(ఎల్‌బీ)	12	ఎస్‌ఏ–హిందీ (జీ)	02	ఎస్‌ఏ–తెలుగు (ఎల్‌బీ)	16
ఎల్‌పీ–తెలుగు (జి)	01	ఎస్‌ఏ–హిందీ (ఎల్‌బీ)	07	ఎస్‌ఏ–ఉర్దూ (జీ)	01
ఎల్‌పీ–తెలుగు (ఎల్‌బీ)	11	ఎస్‌ఏ–మ్యాథ్స్‌తెలుగు(జీ)	01	ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్–తెలుగు (ఎల్‌బీ)	13
ఎల్‌పీ–ఉర్దూ (జీ)	02	ఎస్‌ఏ–మ్యాథ్స్ తెలుగు (ఎల్‌బీ)	11	ఎస్‌జీటీ–తెలుగు (జీ)	24
పీఈటీ–తెలుగు (ఎల్‌బీ)	03	ఎస్‌ఏ–ఫిజికల్ ఎడ్యుకేషన్ –తెలుగు(ఎల్‌బీ)	03	ఎస్‌జీటీ–తెలుగు (ఎల్‌బీ)	349
పీఈటీ–ఉర్దూ (జీ)	01	ఎస్‌ఏ–ఫిజికల్ సైన్స్–తెలుగు (జనరల్)	01	ఎస్‌టీటీ–ఉర్దూ (జీ)	08
పీఈటీ–ఉర్దూ (ఎల్‌బీ)	02	ఎస్‌ఏ–ఫిజికల్ సైన్స్ –తెలుగు (ఎల్‌బీ)	01	ఎస్‌జీటీ –ఉర్దూ (ఎల్‌బీ)	02
ఎస్‌ఏ జీఎస్–తెలుగు (జీ)	02	ఎస్‌ఏ ఎస్‌ఎస్–తెలుగు (జీ)	02	ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ –తెలుగు(జీ)	02
ఎస్‌ఏ జీఎస్–తెలుగు(ఎల్‌బీ)	22	ఎస్‌ఏ ఎస్‌ఎస్–తెలుగు (ఎల్‌బీ)	36	ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్–తెలుగు (ఎల్‌బీ)	45
ఎస్‌ఏ జీఎస్–ఉర్దూ (జీ)	01				
ఎస్‌ఏ –ఇంగ్లిష్ (జీ)	02				

సర్వే బృందాలను ఏర్పాటు చేయాలి

● కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్న కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు సర్వేకు జిల్లాలో వెంటనే బృందాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు, ఎల్‌ఆర్‌ఎస్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు విషయమై ప్రతి మున్సిపల్ వార్డు, గ్రామ పంచాయతీల్లో 150 కుటుంబాలకు ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం నుంచి ఈ బృందాలకు శిక్షణ ఉంటుందని, ఎంపిక చేసిన సిబ్బంది అంతా హాజరయ్యేలా చూడాలన్నారు. శుక్రవారం నాటికి ఈ బృందాలు క్షేత్రస్థాయిలో సర్వేను ప్రారంభించాలన్నారు. ఇందుకుగాను మున్సిపల్ కమిషనర్లు వారి కార్యాలయాల్లో కుటుంబ డిజిటల్ కార్డుకు సంబంధించి ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసి ఆయా బృందాల్లో ఉండే సిబ్బంది పేర్లు, వారి ఫోన్ నంబర్లతో సహా పత్రికల ద్వారా ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులను గుర్తించి దసరా నాటికి ఇళ్లు పంపిణీ చేయాలన్నారు. వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఈ నెల 3న మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుందని చెప్పారు. ముందుగా మండలానికి ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. ఈసారి జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, వివిధ శాఖల అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారిస్తాం

- ఎస్పీ శరత్ చంద్ర పవార్
- పలు మండలాలను దత్తత తీసుకున్న డీఎస్పీలు



చర్లపల్లిలో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

నల్లగొండ క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం అద్దంకి–నార్కట్‌పల్లి రోడ్డులోని చర్లపల్లిలో ప్రమాదాలు జరిగే స్థలాన్ని డీఎస్పీ శివరాంరెడ్డి, ఎస్‌ఐ సైదాబాబాతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రమాద స్థలాలను గుర్తించి వేగ నియంత్రణ సూచికలు, రేడియం స్టడ్స్, బ్లింకింగ్ లైట్లు, రేడియం స్టిక్కర్స్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారుల వెంట ఉన్న గ్రామాల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై పోలీస్ కళాజాతా బృందాల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ప్రమాదాలు జరుగకుండా పర్యవేక్షించేందుకు నల్లగొండ మండలంలో ఉన్న రహదారులను ఎస్పీ దత్తత తీసుకున్నారు. అదనపు ఎస్పీ రాములునాయక్ వేములపల్లి మండలం, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి కేతేపల్లి మండలం, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు మిర్యాలగూడ మండలం, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు చింతపల్లి మండలాలను దత్తత తీసుకున్నారని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, రూరల్ ఎస్‌ఐ సైదాబాబు, నార్కట్‌పల్లి ఎస్‌ఐ క్రాంతి, రిటైర్డు సీఐ అంజయ్య, రోడ్డు భద్రత ఇంజనీర్లు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు సైదులు కుటుంబ సభ్యులకు మంగళవారం ఎస్పీ రూ.10 వేల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, హోంగార్డు ఆర్‌ఎస్‌ఐ శ్రావణి పాల్గొన్నారు. తదితరులు న్నారు.

గౌరిచెన్ పర్వతాన్ని అధిరోహించిన అన్విత



గౌరిచెన్ పర్వతంపై అన్వితారెడ్డి

భువనగిరి: భువనగిరి పట్టణానికి చెందిన పర్వతారోహకురాలు పడమటి అన్వితారెడ్డి పర్వతారోహణలో మరో రికార్డు సాధించారు. భారత్‌కు చెందిన 38 మంది సైన్యంతో కలిసి అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రం తవాంగ్ జిల్లాలోని 6,488 మీటర్ల ఎత్తులో ఉన్న గౌరిచెన్ పర్వతాన్ని అధిరోహించారు. తూర్పు హిమాలయాలలో మంచుతో నిండిన గౌరిచెన్ పర్వతం వెనకాల చైనా దేశం సరిహద్దు ప్రారంభం అవుతుంది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని డిరాంగ్‌ని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో 30 మంది భారత్ సైన్యంతో పాటు భువనగిరిలో ఉన్న ట్రాన్సెండ్ అడ్వెంచర్ రాక్ క్లైంబింగ్ అకాడమీకి చెందిన 8 మంది సెప్టెంబర్ 1న గౌరిచెన్ పర్వతారోహణను ప్రారంభించి 22వ తేదీన పర్వత శిఖరానికి చేరుకున్నారు. మైనస్ 15డిగ్రీల శీతల వాతావరణంలో పర్వతారోహణ కొనసాగినట్లు అన్వితారెడ్డి చెప్పారు. పర్వతారోహణ ముగించుకుని అన్వితారెడ్డి మంగళవారం భువనగిరికి చేరుకున్నారు. అన్వితారెడ్డి ఇప్పటికే పలు ఎత్తయిన పర్వతాలను అధిరోహించారు. ఎవరెస్టు పర్వతం, కిలిమంజారో, ఎల్‌బ్రోస్, విన్‌సెన్ పర్వతాలను అధిరోహించిన ఆమె.. మరికొన్ని పర్వతాలను అధిరోహించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి వచ్చే పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, ఆస్పత్రిలో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగుల సంఖ్యకు తగినట్లుగా వైద్యుల పోస్టులు, వైద్య సిబ్బంది పోస్టులను ఖాళీగా ఉంచకుండా భర్తీచేయాలన్నారు. డయాలసిస్ బాధితులకు సరిపడా మిషన్లు పెంచాలన్నారు. ఆయన వెంట సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, గౌతం రెడ్డి, లక్ష్మీనారాయణ, వినోద్‌నాయక్ ఉన్నారు.

వయోవృద్ధులను గౌరవించాలి



వృద్ధులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, ఏఎస్పీ రాములు నాయక్ తదితరులు

● అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ: వయోవృద్ధులను గౌరవించడం అందరి బాధ్యతని అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజానికి వృద్ధులు చేసిన సేవలు మరువలేమన్నారు. జిల్లాలో వృద్ధులకు సంబంధించి నమోదైన 280 కేసులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. మండల స్థాయిలో వయోవృద్ధుల కమిటీల ఏర్పాటు, వారికి చికిత్స తదితర విషయాలపై జిల్లా అధికారులు దృష్టి సారిస్తున్నారని తెలిపారు. అనంతరం ఆయన వృద్ధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాములు నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి, డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ శారద, వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునరావు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

నీలగిరిలో కుక్కల బెడద

ఏ వీధిలో చూసినా గుంపులుగా సంచారం

- బెంబేలెత్తిపోతున్న వివిధ కాలనీల ప్రజలు
- పిల్లలకు ముప్పు పొంచి ఉందని తల్లిదండ్రుల ఆందోళన
- కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని వేడుకోలు



శాంతినగర్‌లో తిరుగుతున్న కుక్కల గుంపు

నీలగిరిలో వార్డులు 48
జనాభా 2లక్షలకు పైగా..
కుక్కలు అధికంగా ఉన్న కాలనీల సంఖ్య 08
స్వల్పంగా ఉన్న కాలనీలు 12
పట్టణంలో కుక్కల సంఖ్య సుమారు 5 వేలకు పైగా..

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలో కుక్కల బెడద ఎక్కువైంది. పలు కాలనీల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా శాంతినగర్, బీటీఎస్, ఏఆర్‌నగర్, గొల్లగూడ, చైతన్యపురి, బొట్టుగూడ, మాన్యంచెల్క, శివాజీనగర్, పానగల్ రోడ్డు, హైదరాబాద్ రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. పదుల సంఖ్యలో ఒకేసారి కాలనీల్లోని వీధులు, ప్రధాన రోడ్ల వెంట పరుగులు తీస్తుంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు ఒంటరిగా ఉంటే వారిని వెంబడించే ప్రయత్నం చేస్తున్నాయి. ఇళ్ల ముందు ఆడుకునే పిల్లలను ఎక్కడ కరుస్తాయోనని పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

సంతాన రహిత ఆపరేషన్లు చేస్తున్నా..

గత ఐదారేళ్లుగా నీలగిరి పట్టణంలో ఉన్న కుక్కలకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సంతాన రహిత ఆపరేషన్లు చేస్తున్నారు. అయినా కానీ, పట్టణంలో గతంలో కన్నా కుక్కల సంఖ్యలో చాలా రెట్లు పెరిగిపోయినట్లు తెలుస్తోంది. ఎక్కడ చూసినా కుక్కలు సంచరిస్తున్నాయి. ఇలాంటి కుక్కల మందను ఇదివరికెన్నడూ చూడలేదని స్థానికులు చెబుతున్నారు. కాలనీల్లో తిరిగే వాటిని స్థానికులు గుర్తు పడతారు. కొత్తగా ఎక్కడి నుంచైనా వస్తున్నాయనే చర్చ కూడా లేకపోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో కుక్కలకు సంతాన రహిత ఆపరేషన్లు లేకపోవడంతో అక్కడ వాటి పట్టణానికి వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కుక్కల నివారణ మున్సిపల్ అధికారులకు పెద్ద సవాల్‌గా మారింది. కోర్టు తీర్పు నేపథ్యంలో సంతాన రహిత ఆపరేషన్లు చేయించడం తప్ప మరో మార్గం లేదనే వాదన కూడా వినిపిస్తోంది. కానీ కాలనీల్లో చూస్తుంటే మాత్రం కుక్కల సమస్య చాలా జఠిలంగా మారిందని, వాటి బెడద నుంచి రక్షణ కల్పించాలని పట్టణంలోని వివిధ కాలనీల వాసులు వేడుకుంటున్నారు.

ఐదు ఉద్యోగాలు సాధించిన వాణి


భీమిడి వాణి

గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని అంబాల గ్రామానికి చెందిన భీమిడి వాణి ఏకంగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి శెభాష్ అనిపించుకుంది. మూడు నెలల క్రితం ప్రకటించిన గురుకుల ఫలితాల్లో జూనియర్ లెక్చరర్(తెలుగు), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ)గా, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) పోస్టులు సాధించింది. ప్రస్తుతం ఆమె కీసర గురుకుల కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఆదివారం వెల్లడైన డీఎస్సీ ఫలితాల్లోనూ వాణి.. స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)గా, లాంగ్వేజ్ పండిట్ (తెలుగు) పోస్టులకూ ఎంపికైంది. ఐదు ఉద్యోగాలు సాధించిన వాణి ఆదర్శంగా నిలిచింది.

మూడు ఉద్యోగాలతో ఆదర్శంగా పారిజాత


గోరంట్ల పారిజాత

రామన్నపేట : లక్ష్య సాధనకు వైవాహిక జీవితం అడ్డుకాదని నిరూపించింది రామన్నపేటకు చెందిన గృహిణి గోరంట్ల పారిజాత. భర్త ప్రోత్సాహంతో డీఎస్సీ–2024లో స్కూల్ అసిస్టెంట్(తెలుగు), లాంగ్వేజ్ పండిట్, ఎస్జీటీ పోస్టులకు అర్హత సాధించింది. సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్(తెలుగు) విభాగంలో జిల్లా స్థాయిలో 16వ ర్యాంకు, లాంగ్వేజ్ పండిట్‌లో–13వ ర్యాంకు, సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగంలో 24వ ర్యాంకు సాధించింది.

ఒకేసారి మూడు ఉద్యోగాలు


బండి యమున

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల గ్రామంలో రైతు కుటుంబానికి చెందిన బండి యమున ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీతోపాటు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాలు సాధించింది. కాగా తండ్రి మల్లేశ్‌కు ముగ్గురు కుమార్తెలు.. యమున పెద్ద కుమార్తె. ఇంటర్ తరువాత డీఈడీ పూర్తి చేసింది. అనంతరం ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూనే ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, బీఈడీ, పీజీ పూర్తి చేసింది.

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

నేటి నుంచి బతుకమ్మ వేడుకలు

- మొదటి రోజు ఎంగిలి పువ్వు బతుకమ్మ
- తొమ్మిది రోజులపాటు ఆడపడుచుల ఆటపాటల సందడి

పువ్వులనే దైవంగా పూజించే ప్రత్యేక పండుగ బతుకమ్మ. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి ప్రకృతితో అనుబంధాన్ని తెలియజేస్తుంది బతుకమ్మ పండుగ. పూల అమరిక నుంచి పాటల ఆలాపన వరకు ప్రతిదీ మనోహరంగా బతుకమ్మ పండుగలో ఆవిష్కృతమవుతుంది. బుధవారం నుంచి బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల ఈ వేడుకల్లో తంగేడు, గునుగు, జిల్లేడు, బంతి, చామంతి ఇలా ఎన్నో కుసుమాలు బతుకమ్మ కోసమే పూశాయా అనిపిస్తుంది. రాష్ట్రంలో శరన్నవ రాత్రులకు ఒకరోజు ముందే అంటే భాద్రపద బహుళ అమావాస్య నుంచి అశ్వయుజ శుక్ల అష్టమి వరకూ బతుకమ్మ పండుగ చేస్తారు.

-రామగిరి(నల్లగొండ), యాదగిరిగుట్ట



బతుకమ్మ పండుగ అంటే మహిళల పండుగ.ఈ పండుగకు సంబంధించి అనేక కథలు వాడుకలో ఉన్నాయి. అయితే బాగా ప్రాచుర్యంలో ఉన్న కథ మాత్రం ఇదే.. భూస్వాముల అకృత్యాలను భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమెను ఊరి ప్రజలు చిరకాలం 'బతుకమ్మా'అని దీవించారట. అందుకనే ఈ పండుగ మహిళలను కీర్తిస్తూ జరుపుకునే పండుగ అంటున్నారు. తాము ఆపదలకు దూరంగా ఉండాలని, కుటుంబం చల్లగా ఉండాలని బతుకమ్మ పండుగ సందర్భంగా గౌరమ్మను మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తారు.

ధర్మాంగదుడి వృత్తాంతం..

చోళ దేశాన్ని పాలిపాలించే ధర్మంగదుడి వందమంది కుమారులు యుద్ధంలో వీర మరణం పొందుతారు. దీంతో రాజు భార్య సత్యవతి సంతాన ప్రాప్తి కోసం లక్ష్మీ దేవిని వేడుకోవడంతో ఓ కూతురు జన్మిస్తుంది. కనీసం ఆ కూతురైనా బతకాలని కోరుకుంటూ.. చల్లంగా 'బతుకమ్మ'అని దేవతలు, మునులు దీవించారని ప్రతీతి. ఆ రోజు నుంచి ఆ యువరాణి దీర్ఘాయుష్మురాలై బతుకాలని కోరుతూ బతుకమ్మను కొలవడం ఆనవాయితీగా వస్తోందని ఓ కథ ప్రచారంలో ఉంది.

ఒక్కో పువ్వుకు ఒక్కో విశిష్టత

గునుగు పూలు



బతుకమ్మ పండుగలో గునుగు పూలకు చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ పూలు పంట చేల గట్ల వెంబడి లభిస్తాయి. గునుగు శాస్త్రీయ నామం సెలోసియా. ఇది ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉన్న గడ్డిజాతి పుష్పం. దీనిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ డయాబెటిక్ గుణాలు ఉంటాయి. గాయాలు నయం చేయడానికి, మధుమేహం, చర్మ సమస్యల నివారణకు ప్రసిద్ధి.

గుమ్మడి పువ్వు



బతుకమ్మను పేర్చేందుకు కావాల్సిన పుష్పాల్లో గుమ్మడి పువ్వులకు ప్రత్యేక స్థానం ఉంది. తమకు భోగభాగ్యాలు అందించి, పిల్లాపాపలను చల్లగా చూడాలని వేడుకుంటూ మహిళలు పసుపుతో గౌరీ దేవిని తయారు చేసి ఈ పువ్వులో ప్రతిష్టిస్తారు. తంగేడు పువ్వుల తరువాత గుమ్మడికే ప్రత్యేక గుర్తింపు రావడానికి కాకతీయు కాలం నాటి సామాజిక మత పరిస్థితులే కారణమని చరిత్ర చెబుతోంది. ఇంకా బీరపువ్వు, దోస పువ్వు, గుమ్మడి పువ్వులు, వాము పూలు వంటి కూరగాయ మొక్కల పువ్వులు, అలాగే తామరపువ్వు, గన్నేరు పువ్వు, కట్ల పువ్వుతో సహా స్థానికంగా విరబూసే ఏ పువ్వునైనా బతుకమ్మకు ఉపయోగిస్తారు.

గడ్డిపువ్వు



చిట్టి చామంతి లాగే రోడ్డు పక్కన గడ్డిలో మొలిచే గడ్డిపువ్వు కూడా బతుకమ్మలో భాగమే. ఈ పువ్వులో యాంటీవైరల్, యాంటీ ఆక్సిడెంట్, యాంటీబయాటిక్ గుణాలుంటాయి. గాయాలు మాన్పడానికి, రక్తస్రావం ఆపడానికి, జుట్టుకు పోషణ కోసం గిరిజనులు ఈ గడ్డిపూలనే ఉపయోగిస్తారు.

బంతి, చామంతి పూలు



సాధారణంగా ఇంటి అలంకరణ కోసం తోరణాలుగా, దేవుడికి పూల దండల కోసం బంతి, చామంతి పూలను ఉపయోగిస్తాం. ఈ పూలు బతుకమ్మను పేర్చడంతో ప్రధానంగా ఉపయోగిస్తారు. ఈ పూలు చర్మ సమస్యలను నివారించే గుణాలు కలిగి ఉంటాయి.

మల్లె, లిల్లీ పూలు




మల్లెపూలు, లిల్లీపూలను కూడా బతుకమ్మలను పేర్చడంలో ఉపయోగిస్తారు. బతుకమ్మను పేర్చేటప్పుడు ఈ పూలను పై వరుసలో ఉపయోగిస్తారు. వీటిని ఉపయోగించడం వల్ల పరిసరాలు మొత్తం సువాసనలు వెదజల్లుతాయి.



తంగేడు పూలు

తంగేడు అనేది తెలంగాణ రాష్ట్ర పుష్పం. ఇది బతుకమ్మను పేర్చడంలో ఉపయోగించే ప్రధానం పుష్పం. దీని శాస్త్రీయ నామం సెన్నా ఆరిక్యులాట. తంగేడు అనేక ఔషధ గుణాలను కలిగిన పుష్పం. నాటు వైద్యంలో మలబద్ధకం, మధుమేహం, ఇతర మూత్రనాళ సమస్యల నివారణ కోసం ఉపయోగిస్తారు.

గౌరమ్మగా కూష్మాండం



జైన దేవత అయిన కూష్మాండినిని.. శైవ మతం ప్రాబల్యం పొందిన తరువాత పద్మాక్షి దేవిగా పూజించడం ప్రారంభించారు. కుష్మాండం అనగా గుమ్మడికాయ అని అర్థం. గుమ్మడి ఆకులను సిబ్బిలో పరిచిన తరువాతనే బతుకమ్మను పేరుస్తారు. పసుపుపచ్చగా ఉండే గుమ్మడి పువ్వులోని అండాశయం, దాని చుట్టూ ఉన్న కేసరములను బతుకమ్మ పైభాగంలో గౌరీదేవిగా ప్రతిష్టిస్తారు.

బతుకమ్మకు వివిధ రకాల నైవేద్యం..

బతుకమ్మను లక్ష్మీదేవి, పార్వతీదేవి అంశగానే కాదు, శ్రీచక్రశోభితగా, ప్రకృతికి ప్రతిరూపంగా, తమ ఇంటి ముత్తయిదువుగా భావిస్తారు. ఈ సంగతులన్నింటినీ పాటలుగా ఆలపిస్తారు. బతుకమ్మకు వివిధ రకాల నైవేద్యాలు సమర్పిస్తారు. అమ్మవారి ఇష్టాలకు తగ్గట్టుగా పులి హోర, పులగం, బెల్లపు అన్నం, పెరుగన్నం, పాయసం, నెయ్యి కలిపిన అన్నం నివేదిస్తారు. బతుకమ్మ పండుగలో లలితాదేవి ఆరాధన దాగి ఉందని ఈ నైవేద్యాల వల్ల అర్థమవుతుంది.

ఒక్కో రోజు ఒక్కో నైవేద్యం

ఎంగిలి పూల బతుకమ్మ : మొదటి రోజు పేర్చే బతుకమ్మను ఎంగిలి పూల బతుకమ్మ అని పిలుస్తారు. ఇది మహాలయ అమావాస్య రోజున ప్రారంభమవుతుంది. దీనిని రాష్ట్రంలో పెత్రామాస (పితృఅమావాస్య) అని అంటారు. ఈ రోజున గౌరమ్మకు నైవేద్యంగా నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి పెడతారు.

- **అటుకుల బతుకమ్మ** : రెండో రోజు నిర్వహించే బతుకమ్మను 'అటుకుల బతుకమ్మ' అని పిలుస్తారు. ఈరోజు ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి తిథి ఉంటుంది. అటుకుల బతుకమ్మ రోజు అమ్మవారికి సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో వండిన పదార్థాలను నైవేద్యంగా సమర్పిస్తారు.
- **ముద్దపప్పు బతుకమ్మ** : మూడోరోజు ముద్దపప్పు బతుకమ్మ. ఈ రోజు ముద్దపప్పు, పాలు, బెల్లంతో అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.
- **నానే బియ్యం బతుకమ్మ** : నాలుగో రోజు నానే బియ్యం బతుకమ్మ పేరుతో పండుగను నిర్వహించుకుంటారు. ఈ రోజు నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి చేసిన పదార్థాలను నైవేద్యంగా నివేదిస్తారు.
- **అట్ల బతుకమ్మ** : ఐదో రోజు అట్ల బతుకమ్మ పండుగ చేస్తారు. అట్లు లేదా దోశలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.
- **అలిగిన బతుకమ్మ** : ఆరో రోజు బతుకమ్మ అలిగిందని భక్తులు విశ్వసించి, ఆ రోజు ఎటువంటి నైవేద్యమూ సమర్పించరు.
- **వేపకాయల బతుకమ్మ** : ఏడో రోజు నిర్వహించే ఉత్సవం పేరు వేపకాయల బతుకమ్మ. ఈ రోజు బియ్యం పిండిని బాగా వేయించి వేప పండ్లుగా తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.
- **వెన్నముద్దల బతుకమ్మ** : ఎనిమిదో రోజు వెన్నెముద్దల బతుకమ్మ . ఆరోజు ప్రత్యేకంగా నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి తయారు చేసిన పదార్థాలను నైవేద్యంగా అందిస్తారు.
- **సద్దుల బతుకమ్మ** : చివరి రోజును సద్దుల బతుకమ్మగా పిలుస్తారు. ఆరోజు ఆశ్వయుజ అష్టమి. అదేవిధంగా దుర్గాష్టమి కూడా జరుపుకుంటారు. సద్దుల బతుకమ్మ రోజు నైవేద్యంగా పెరుగన్నం, చింతపండు పులిహోర, కొబ్బరన్నం, నువ్వుల న్నం ఇలా ఐదు రకాల వంటకాలను తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు. ఆడపడుచుల ఆటపాటలతో తొమ్మిది రోజులపాటు బతుకమ్మను పూజించి గంగలో నిమజ్జనం చేస్తారు. అనంతరం పసుపుతో తయారు చేసిన గౌరమ్మను మహిళలు తమ పుస్తెలకు పూసుకుంటారు. ఇలా చేయడం వల్ల తమ మాంగళ్యం పది కాలాలపాటు సురక్షితంగా ఉంటుందని మహిళలు నమ్ముతారు.



ఇంటి ప్రహరీని ఢీకొట్టిన స్కూల్ బస్సు

- విద్యార్థులకు స్వల్ప గాయాలు

మిర్యాలగూడ టౌన్ : స్కూల్ బస్సు అదుపు తప్పి ప్రమాదం నుంచి విద్యార్థులు బయటపడిన సంఘటన మంగళవారం మిర్యాలగూడ మండలంలో చోటుచేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ పి.లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కిష్టాపురం, హట్యతండాకు చెందిన విద్యార్థులను సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామ సమీపంలో గల వీవీఆర్ సిటీ సెంట్రల్ స్కూల్‌కు బస్సు డ్రైవర్ పెండెం సైదులు రోజు మాదిరిగానే పిల్లలను ఎక్కించుకుని వస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మార్గమధ్యలో అవంతీపురంలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 30 మంది విద్యార్థులు దైవ దర్శనం చేసుకున్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో గుట్ట దిగుతున్న సమయంలో స్కూల్ బస్సు అదుపు తప్పింది. ఘాట్ రోడ్డు కావడంతో వేగంగా దూసుకొచ్చి గుట్ట కింద ఉన్న లింగంపల్లి రవి ఇంటి ప్రహరీని బస్సు ఢీ కొట్టింది. దీంతో ఆ బస్సులో ఉన్న విద్యార్థి చందన కుడి మోకాలుకు, ధీరావత్ దేవాదత్, దేవ అనూష్, ధీరావత్ మహాలక్ష్మి, ధీరావత్ వెన్నెలతోపాటు పలువురు విద్యార్థుల కాళ్లు, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. సమీపంలో గుట్ట కింద కూర్చున్న కొంత మంది బస్సు వద్దకు వచ్చి విద్యార్థులకు కిందకు దించారు. స్వల్ప గాయాలైన విద్యార్థులను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు అప్పగించారు. మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని చందన తండ్రి సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎంవీఐ

విషయం తెలుసుకున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వీరస్వామి సంఘటన స్థలానికి వెళ్లి స్కూల్ బస్సును పరిశీలించారు. వీవీఆర్ సిటీ సెంట్రల్ స్కూల్‌కు చెందిన బస్సుకు 2022వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఫిట్‌నెస్ చేయించలేదని, అనుమతి పత్రాలు కూడా లేవని ఆయన తెలిపారు. స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ లేకపోవడం , డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని, ఈ బస్సును సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

వేధింపులు తాళలేకనే హత్య

- గత నెల 27న జగదీష్‌ను హత్య చేసిన భార్య తరఫు బంధువులు
- ఘటనకు సంబంధించి ఐదుగురి అరెస్టు
- వివరాలను వెల్లడించిన దేవరకొండ డీఎస్పీ గిరిబాబు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గిరిబాబు

డిండి: భార్యకు దూరంగా ఉంటూ ఓ బాలికను వివాహం చేసుకుని పెడుతున్న వేధింపులు తాళలేక భార్య తరఫు కుటుంబ సభ్యులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం డిండి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు వెల్లడించారు. డిండి మండల పరిధిలోని కామేపల్లి గ్రామానికి చెందిన రమాదేవికి కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి చెందిన శ్రీపతి జగదీష్(35)తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు.

బాలికను వివాహం చేసుకోవడంతో జైలుకు..

హైదరాబాద్‌లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్న జగదీష్.. కుటుంబ కలహాల కారణంగా భార్య రమాదేవితో కొన్నేళ్ల నుంచి వేరుగా నివాసం ఉంటున్నాడు. ఇది ఇలా ఉండగా.. కామేపల్లిలో నివాసం ఉంటున్న భార్య రమాదేవి అక్క నిర్మల కూతురితో జగదీష్ పరిచయం ఏర్పచుకుని మాయమాటలు చెప్పి 6 నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆ బాలికను వేధిస్తూ ఇరువురు దిగిన అసభ్యకరమైన ఫొటోలు రమాదేవి కుటుంబ సభ్యులకు వాట్సాప్ ద్వారా షేర్ చేసేవాడు. దీంతో మైనర్‌ను వివాహం చేసుకున్నాడని బాలిక తల్లిదండ్రులు అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జగదీష్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు పంపారు. జగదీష్ కొన్నాళ్ల జైలుకు కూడా వెళ్లి వచ్చాడు.

ఎలాగైనా అంతమొందించాలని..

భార్య రమాదేవికి దూరంగా ఉండడం, వరుసకు కూతురైన బాలికను వివాహం చేసుకుని పెడుతున్న ఇబ్బందులను భరించలేక జగదీష్‌ను ఎలాగైనా అంతమొందించాలని అతడి భార్య తరఫు కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ నెల 27వ తేదీన ఉదయం హైదరాబాద్‌లోని అల్వాల్‌లో నివాసం ఉంటున్న జగదీష్ ఇంటికి వెళ్లి భార్య రమాదేవి ఇంటి యజమాని సహాయంతో జగదీష్‌ను పిలిపించింది. డోర్ తీసిన వెంటనే రమాదేవితోపాటు బాలిక తల్లిదండ్రులు కొంకి పెద్దయ్య, నిర్మల, సోదరులు మధు, అరవింద్ ఒక్కసారిగా జగదీష్‌పై దాడి చేసి తాడుతో కాళ్లు, చేతులు, నోటిని చున్నీతో కట్టేసి అద్దె కారులో పడేశారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి దేవరకొండ మీదుగా డిండి మండల పరిధిలోని చెర్కుపల్లి స్టేజీ సమీపంలోని గుట్టలకు తీసుకొచ్చారు. రమాదేవి, నిర్మల కాపల కాస్తుండగా పెద్దయ్య, అరవింద్, మధు.. జగదీష్‌ను తలపై బండరాయితో మోది దారుణంగా హత్య చేశారు.

సీసీ కెమెరాల ఆధారంగా..

ఈ నెల 28వ తేదీన డిండి మండలంలోని పెద్దతండాకు చెందిన ఓ రైతు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా హత్యకు గురయ్యాడని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చెర్కుపల్లి గేటు సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా మొదటగా జగదీష్‌ను గుర్తించి అతడి కుటుంబ సభ్యుల ఆధారంగా పలు విషయాలు తెలుసుకున్న పోలీసులు.. కామేపల్లిలో ఉంటున్న పెద్దయ్యను స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా తనతోపాటు భార్య నిర్మల, కుమారులు అరవింద్, మధు, మృతుడి భార్య రమాదేవి కలిసి హత్య చేసినట్లు పెద్దయ్య ఒప్పుకున్నాడు. ఈ ఘటనలో నిందితులైన ఐదుగురిని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. హత్య కేసును రెండు రోజుల్లోనే ఛేదించిన డిండి రూరల్ సీఐ ఎస్.సురేష్, ఎస్‌ఐలు రాజు, సతీష్, సిబ్బంది ఉస్సేన్, నాగరాజు, సైదమ్మ, తిర్పతయ్య, గణేశ్‌లను ఎస్పీ శరత్ చంద్ర పవార్, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అభినందించారు.

ఏటీఎంలే టార్గెట్‌గా దొంగతనాలు

- నిందితుల వద్ద పలు బ్యాంకుల ఏటీఎం కార్డులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట డీఎస్పీ రవి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేట టౌన్ : పలు బ్యాంకులకు చెందిన ఏటీఎంలలో డబ్బులు డ్రా చేసినట్టే చేసి.. తిరిగి వారి అకౌంట్‌లోనే డబ్బులు పడేటట్లు చేస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ రవి వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గౌరవకుమార్, ఉదయ్‌భాను, విమల్‌లు ఏటీఎంలే టార్గెట్ చేసుకుంటూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. నిందితులు వారి సొంత ఏటీఎం కార్డులను ఉపయోగించి డబ్బులు డ్రా చేసేందుకు ఏటీఎంలలోకి వెళ్లి పిన్ ఎంటర్ చేస్తారు. ఏటీఎం మిషన్ నుంచి డబ్బులు బయటకు వచ్చే సమయంలో ఏటీఎం మెషిన్ లాన్ కేబుల్‌ను తొలగిస్తారు. ఆ సమయంలో వీరు ఎంటర్ చేసిన నగదు ఏటీఎం మిషన్‌లో నుంచి బయటకు వస్తుంది. కానీ ఏటీఎం మెషిన్ లాన్ కేబుల్‌ను తొలగించడంతో నెట్‌వర్క్ సమస్య కారణంగా వీరు ఎంతయితే నగదు డ్రా చేస్తారో.. ఆ నగదు తిరిగి వారి ఖాతాలోనే జమ అవుతుంది. ఇలా రోజూ ప్రతి కార్డుకు రూ.10వేల చొప్పున డ్రా చేసినట్టే చేసి లాన్ కేబుల్‌ను తొలగిస్తూ ఏటీఎంల నుంచి వచ్చిన డబ్బులతో ఉడాయిస్తున్నారు. సెప్టెంబర్ 27న పోచంపల్లి బ్యాంకు, 28న డీబీఎస్ బ్యాంక్‌లో దొంగతనం చేసేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం మేరకు పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. మరో నిందితుడు విమల్ పరారీలో ఉన్నట్టు చెప్పారు. నిందితుల వద్ద నుంచి రూ.20వేల నగదు, ఏటీఎం కార్డులు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ కుశలవ, హెడ్ కానిస్టేబుళ్ల కృష్ణ, కరుణాకర్, సైదులును డీఎస్పీ రవి అభినందించారు.

20 గొర్రెల అపహరణ

ఆలేరురూరల్ : గుర్తు తెలియని దుండగులు 20 గొర్రెలను అపహరించిన సంఘటన ఆలేరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మున్సిపాలిటీ 6వ వార్డు బహద్దూర్‌పేటకు చెందిన కూళ్ల చంద్రయ్య, సాయి ఊరి శివారులో ఉన్న తమ దొడ్డిలోకి సోమవారం సాయంత్రం గొర్రెలను తోలి ఇంటికి వెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున చూసేసరికి 20 గొర్రెలు కనిపించకుండా పోయాయి. చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రజినీకర్ తెలిపారు.

యువకుల మృతితో మూడు గ్రామాల్లో విషాదఛాయలు


వంశీ అంత్యక్రియలకు భారీగా హాజరైన గ్రామస్తులు

వేములపల్లి(మాడ్గులపల్లి): సూర్యాపేట జిల్లా చిలుకూరులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాడ్గులపల్లి, వేములపల్లి మండలాలకు చెందిన యువకులు మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు.. మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన అవిరెండ్ల శ్రీకాంత్(21), త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారంకు చెందిన మల్లికంటి దినేష్ స్నేహితులు. దినేష్ కారు కొందామని శ్రీకాంత్‌కు చెప్పడంతో వారి స్నేహితుడు వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన వల్లపుదాసు వంశీ(22)కి కారు డ్రైవింగ్ తెలియడంతో ముగ్గురు కలిసి సోమవారం ఒకే బైక్‌పై కోదాడకు వెళ్లారు. రాత్రి స్వగ్రామాలకు తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలపాలై ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. చేతికందిన కొడుకులు మృతి చెందడంతో యువకుల తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. యువకుల మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.